సాక్షి జగిత్యాల
శుక్రవారం । 17 । మార్చి । 2023



కొండపై సీపీ పూజలు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని కరీంనగర్ పోలీసు కమిషనర్ సుబ్బారాయుడు గురువారం దర్శించుకున్నారు.



అభివృద్ధి పనులపై దృష్టి

కథలాపూర్ : ఉపాధిహామీ పనుల్లో జాప్యం చేయవద్దని డీపీవో నరేశ్ సూచించారు. గంభీర్‌పూర్‌లో చేపట్టిన పనులు పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
31.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉరుములో కూడిన భారీవర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. గురువారం ప్రధానోపాధ్యాయులతో తొలిమెట్టు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు తమ విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులు అందరూ కనీస అభ్యాసన సామర్థ్యాలు సాధించేలా అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. ఎంఈవోలు, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారులు ఉన్నత పాఠశాలలను పర్యవేక్షించి పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సహించాలని చెప్పారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ మకరంద్, జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శివకృష్ణ, కోఆర్డినేటర్ రాజేశ్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండోరోజు ప్రశాంతం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాల: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 29 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. ద్వితీయ సంవత్సర పరీక్షలకు మొత్తం 8,079 మంది విద్యార్థులకు 7,843 మంది హాజరయ్యారు. 97.01శాతం విద్యార్థులకు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ మకరంద్ జిల్లా కేంద్రంలోని పలు పరీక్షకేంద్రాలను పరిశీలించారు. సీసీకెమెరాలు పనిచేయాలని, ఏర్పాట్లలో ఇబ్బందులు కలగవద్దని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నారాయణ, డీఈసీ సభ్యుడు గంగాధర్ పాల్గొన్నారు.

సువిధతో ఆర్థికాభివృద్ధి

మల్యాల(చొప్పదండి): మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు, తక్షణ అవసరాలకు తోడ్పాటు అందించేందుకు 'సువిధ' ద్వారా సౌకర్యం కల్పించామని, సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్డీవో సుధీర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన సెర్ప్ ఏపీఎం రాజయ్యతో కలిసి మాట్లాడారు. మహిళా సంఘాల అవసరాలు తీర్చేలా రూ.5వేల – రూ.40వేల వరకు రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళలు రుణాలు తీసుకుని, వాయిదాలను సకాలంలో చెల్లించాలని సూచించారు.

జాతీయస్థాయి పరీక్షలో ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కథలాపూర్(వేములవాడ): గురుకుల నేషనల్ అప్టిట్యూడ్ టెస్ట్(జీఎన్ఏటీ)– 2023లో అంబారిపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం మార్గం రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న ఇ.సుకృత, ఎస్.భవిత జాతీయస్థాయిలో 818 ర్యాంక్ సాధించారు. పదో తరగతి చదువుతున్న జి.అంజలి 820 ర్యాంక్, కె.సంగీత 997 ర్యాంక్ సాధించారు. ఏడో తరగతి చదువుతున్న కె.మనస్వి 2,196 ర్యాంక్, ఎనిమిదో తరగతి చదువుతున్న కె.ధనుంజయ్ 1,645 ర్యాంక్, తొమ్మిదో తరగతి చదువుతున్న బి.హన్సిక 1,688 ర్యాంక్ సాధించారు. వీరిని సర్పంచ్ గోపు శ్రీనివాస్, ఎంపీటీసీ వేముల గంగరాజం, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ఉమ, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వచ్చే మూడురోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ గురువారం కోరారు. తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఆయన తెలిపారు. రైతులు తమ పంటలను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఆరబెట్టిన పసుపు, కోతకు వచ్చిన మొక్కజొన్నను షెడ్లలో నిల్వ చేసుకోవాలని ఆయన కోరారు.

టీచకుడు!

మహిళా సిబ్బందిని వేధిస్తున్న ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

- నిత్యం ఉద్యోగినుల శరీరాలు తాకేందుకు తహతహ
- ఆగడాలు భరించలేక వీడియోలు తీసిన సిబ్బంది
- వీడియోలను కలెక్టర్ కార్యాలయానికి పంపిన 'సాక్షి'
- సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన కలెక్టర్ యాస్మిన్



సాక్షి ఎక్స్‌క్లూజివ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అతనో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన అతను దారి తప్పాడు. తరగతి గదిలో పాఠాలు చెప్పాల్సింది పోయి.., తోటి మహిళా సిబ్బందిపై కన్నేస్తున్నాడు. తన కోరిక తీర్చాలంటూ పరోక్షంగా వేధిస్తున్నాడు. మాట వినకుంటే మహిళా సిబ్బందిని వేధిస్తూ తన ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. మొత్తానికి 'కామాతురాణం న భయం..' అన్న మాటలను మరోసారి తన చేష్టలతో రుజువు చేస్తున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తోటి మహిళా సిబ్బందిని తన కామకోరికలు తీర్చాలంటూ వేధించే ఈ కీచక గురువుపై ఉన్నతాధికారులకు ఇటీవల వరుస ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అతని తప్పులను ఆధారాలతో సహా అటు హైదరాబాద్‌కు, ఇటు జగిత్యాల ఉన్నతాధికారులకు అందించారు. అతని ఆగడాలకు సంబంధించిన ఆధారాలను 'సాక్షి' కూడా కలెక్టర్‌కు పంపడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

తాకేందుకు తహతహ

ఈ వ్యవహారంలో కీచక గురువు పేరు ఎం.శ్రీనివాస్. జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం ఇటిక్యాలలోని మోడల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇతను మహిళా సిబ్బందితో విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. మహిళలు ఒంటరిగా దొరికితే ఏదో వంకతో తాకేందుకు తహతహలాడుతున్నాడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ''ఇదేం పాడు బుద్ధి'' అని మిగిలిన సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. కొత్తలో అతనిది కేవలం మితిమీరిన క్రమశిక్షణ అనుకున్నామని.. కానీ, పోను పోను అతని అసలు ఉద్దేశం అర్థమైందని చెబుతున్నారు. తన దారికి రాని మహిళలను క్రమశిక్షణ పేరుతో వేధిస్తున్నాడని మిగిలిన టీచర్లు వాపోతున్నారు. నిమిషం ఆలస్యమైనా మెయిన్ గేట్లు వేసేస్తున్నాడని, అందరి ముందు పరువు తీసేలా కించపరుస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురు తిరిగితే తమను రకరకాల కారణాలు చెప్పి వేధిస్తున్నాడని, పనిచేసే చోట ఇలాంటి వాతావరణం తమకు తీవ్ర ఆందోళన కలగజేస్తోందని వాపోతున్నారు. ఒక దశలో అతని ఆగడాలు భరించలేక ఏకంగా అతని పైత్యపు చేష్టలను వీడియో తీశారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు..!

శ్రీనివాస్ తిక్క చేష్టలపై అతని కింద పనిచేస్తున్న సిబ్బంది మొత్తం కలిసి ఇటీవల ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అతను పాఠశాలలో ప్రవర్తిస్తున్న తీరును క్షుణ్ణంగా వివరిస్తూ.. ఫిబ్రవరి ఆఖరు వారంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మోడల్ స్కూల్, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లకు రిజిష్టర్‌పోస్టు ద్వారా కలెక్టర్ జగిత్యాల, డీఈవోలకు నేరుగా ఫిర్యాదులను అందజేశారు. తమను స్వేచ్ఛగా పనిచేయకుండా చేస్తోన్న సదరు ప్రిన్సిపాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తను కాలేజీలో మహిళలను వేధిస్తుండగా తీసిన వీడియోలు, ఫొటోలను ఫిర్యాదుకు జతచేశారు.

ఫిర్యాదులో ఇంకేమున్నాయంటే..?

- స్టాఫ్ రూంలో మహిళలు ఒంటరిగా కనిపిస్తే వారిని తాకేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఫిర్యాదు కాపీకి అందజేశారు.
- పదో తరగతి విద్యార్థుల నుంచి నిర్ధారిత ఫీజుల కన్నా అదనంగా వసూలు చేస్తున్నాడు.
- విద్యార్థుల నుంచి పారిశుద్ధ్య చార్జీలు అంటూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. అలా వసూలు చేసిన మొత్తాన్ని కాలేజీ ఖాతాలో జమచేయడం లేదు.
- చిన్న కారణాలకే విద్యార్థులను ఇష్టానుసారంగా గొడ్లను బాదినట్లు బాదుతున్నాడు. ఇటీవల ఓ విద్యార్థిని చావబాదితే.. అతని తల్లిదండ్రులు పాత కలెక్టర్ రవికి ఫిర్యాదు చేశారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల: ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ ఎం.కృష్ణంరాజు ఈనెల 14న అక్కడి బస్టాండ్‌లో మద్యం తాగి ఆ మత్తులో కిందపడిపోయాడు. ఈ ఘటన కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో విచారణ జరిపారు. ఈనెల 14న సదరు ఉపాధ్యాయుడు పాఠశాల విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. మద్యం మత్తులో బస్టాండ్‌లో పడిపోయాడని నివేదికలో పేర్కొన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కృష్ణంరాజును సస్పెండ్ చేస్తూ డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

సస్పెండ్ చేస్తున్నాం

ఈ నేపథ్యంలో సదరు గురువు మహిళలను కళాశాలలోనే అసభ్యకరంగా తాకుతున్న వీడియోలు 'సాక్షి'కి చేరాయి. ఈ వీడియోలను జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషాకు 'సాక్షి' చేరవేసింది. ఈ దృశ్యాలను చూసిన కలెక్టర్ స్పందించారు. వెంటనే సదరు మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

– యాస్మిన్ భాషా, కలెక్టర్

పది పరీక్షలపై నిఘా



పదో తరగతి విద్యార్థులు

- అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు
- సీఎస్ గదిలోనూ ఏర్పాటు
- పరీక్షలు సజావుగా సాగేందుకు చర్యలు

జిల్లా సమాచారం

పాఠశాలలు	మొత్తం టెన్త్ విద్యార్థులు
433	11,177

బాలికలు	బాలురు
5,747	5,430

జగిత్యాల: జిల్లాలో వచ్చే ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఇప్పటినుంచే పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించేందుకు పరీక్ష కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేయడంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి అన్నిపరీక్ష కేంద్రాల్లోని పర్యవేక్షకుల(సీఎస్) గదుల్లోనూ వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

మాస్‌కాపీయింగ్ నిరోధానికి..

- పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్, అక్రమాలు నిరోధించేందుకు ప్రతీ చోట సీసీకెమెరా ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్లలోనే భద్రపరుస్తుంటారు.
- పరీక్ష జరిగేరోజునే ప్రశ్నపత్రాలు పరీక్ష కేంద్రాల్లో సీఎస్, డిపార్ట్‌మెంటల్ అధికారి, పోలీసు భద్రత మధ్య తెరుస్తారు.
- ప్రతీ సెంటర్‌కు పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందు కవర్ సీలు తీసి గదుల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేస్తారు.
- తొలుత సీఎస్, డీఈవో, ఇన్విజిలేటర్లు ప్రశ్నపత్రాల కవర్లపై సంతకం చేసిన, సమయం రాశాకే తెరుస్తారు.
- పరీక్షలు పూర్తయ్యాక జవాబుపత్రాలు సీల్‌చేసేంత వరకూ వీరి పర్యవేక్షణలోనే ప్రక్రియ జరుగుతూ ఉంటుంది.
- ఈ ప్రక్రియ మొత్తాన్ని రికార్డు చేయాలని ప్రభుత్వం సూచించింది.
- ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలల వారు ప్రశ్నపత్రాలు లీక్ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలోనే పరీక్షలను నిఘా నీడలో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.
- చివరి పరీక్షలు పూర్తయ్యాక సీసీ ఫుటేజీలను సీల్డ్ కవర్‌లో వేసి డీఈవోకు అందజేస్తారు.

పారదర్శకత కోసమే..



పదో తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రతీసెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రైవేటు సెంటర్లలో యాజమాన్యాలే ఏర్పాటు చేసుకోవాలి. కొత్తగా సీఎస్ గదుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా పరీక్షల్లో పూర్తిపారదర్శకత ఉంటుంది.

– జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో

ఇంజినీరింగ్ అధికారుల అప్రమత్తం

- తప్పిన పెనుప్రమాదం

సారంగాపూర్(జగిత్యాల): ఎస్సారెస్పీ డి–53 కాలువకు సామర్థ్యానికి మించి సాగునీరు వదలడంతో పొంగిపొర్లింది. ప్రమాదకర పరిస్థితికి చేరడంతో ఇంజినీర్లు అప్రమత్తమై నీటి ప్రవాహం తగ్గించారు. కాకతీయ ప్రధాన కాలువ నుంచి జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి వద్ద ఎస్సారెస్పీ నీటి విభజన జరుగుతుంది. అక్కడ డివిజన్ – 4 కింది పెద్దపల్లి వైపు వెళ్లే కాలువకు, అక్కడి నుంచే డివిజన్ 3 పరిధిలోని డి–53 ప్రధాన కాలువకు నీరు చేరుతుంది. డి–53 ప్రధాన కాలువ నుంచి జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, గొల్లపల్లి, వెల్గటూర్, బుగ్గారం పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. అయితే, చివరి భూములకు సాగునీరు అందడం లేదని భావించిన నీటిపారుదల శాఖ అధికారులు.. మరో రెండు రోజులు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, పెద్దపల్లి వైపు కాలువకు ప్రతీసారి 5,500 క్యూసెక్కులు విడుదల చేస్తారు, అక్కడి నుంచే డి–53 కాలువకు 850 క్యూసెక్కులు పంపిస్తారు. బుధవారం రాత్రి పెద్దపల్లివైపు మూడుగేట్లు ఎత్తి 5,500 క్యూసెక్కులు విడుదల చేయాల్సి ఉంది. కానీ, రెండు గేట్లు ఎత్తి 4,500 క్యూసెక్కులు పంపించారు. అదేసమయంలో 850 క్యూసెక్కులతోపాటు పెద్దపల్లి వైపు వెళ్లాల్సిన 1,000 క్యూసెక్కులు కూడా డి–53కాలువలోకి చేరి ప్రవాహం భారీగా పెరిగింది. సారంగాపూర్–రాయికల్ మండలాల మధ్య ఉన్న అల్లీపూర్ గ్రామానికి చెందిన స్వామిరెడ్డి గురువారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో కాలువ వద్దకు వెళ్లగా ప్రవాహం అధికంగా వస్తుందని గుర్తించాడు. వెంటనే ఇంజినీరింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాడు. అప్రమత్తమైన ఆయా శాఖల అధికారులు ఉదయం 6 గంటల ప్రాంతంలో డి–53 కాలువకు ప్రవాహం తగ్గించడానికి పెద్దపల్లి వైపు వెళ్లే కాలువ మూడోగేట్ ఎత్తారు. దాదాపు 4 గంటల తర్వాత ప్రవాహం తగ్గడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామ శివారుల్లోని పొలాల్లోకి డి–53 ప్రధానకాలువ పొంగి గంట పాటు నీటితో ముంచెత్తింది.

ఒకతరం భవిష్యత్ అంధకారం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

- నిరుద్యోగుల జీవితాలు నాశనం
- దుమ్మెత్తిపోసిన ఏబీవీపీ, బీజేవైఎం, కాంగ్రెస్ శ్రేణులు

జగిత్యాలటౌన్: టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీక్ చేసి ఒకతరం నిరుద్యోగుల జీవితాలను నాశనం చేశారని ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యుడురాపాక సాయికుమార్ విమర్శించారు. ఈమేరకు గురువారం స్థానిక పాతబస్టాండ్ చౌరస్తాలో టీఎస్ పీఎస్సీ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన పాలకులు.. తొమ్మిదేళ్లయినా నోటిఫికేషన్లతోనే కాలం వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రశ్నపత్రాల లీకుల పేరిట టీఎస్ పీఎస్సీ నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టిందన్నారు. సుమారు 35లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. నాయకులు నల్ల నవీన్, మనువాడ నందు, రాజు, కార్తీక్, శ్రీనివాస్, మనోహర్, వినయ్ ఉన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిరుద్యోగుల జీవితాలను నాశనం చేసేందుకే టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీక్ చేసిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్ విమర్శించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ చౌరస్తాలో రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు మంచి రాజేశ్, మెరుగు ఉమేశ్, రంజిత్‌రెడ్డి, మహేశ్, రుద్ర విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

గొల్లపల్లి(ధర్మపురి): సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంతోనే ప్రశ్నపత్రాలు లీకయ్యాయని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం కేసీ ఆర్ దిష్టిబొమ్మ దహనంచేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్‌కు నైతి క బాధ్యత వహిస్తూ బోర్డు చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరారు. నాయకులు రేవెల్ల సత్యంగౌడ్, సరసాని తిరుపతిరెడ్డి, కొండ వెంకటేశ్, హరి, కిరణ్, శ్రీధర్, రామాగౌడ్, రాంమోహన్‌రెడ్డి, కొమురయ్య ఉన్నారు.



జిల్లాలో సాధారణ వర్షం

జగిత్యాలటౌన్: పట్టణంలో గురువారం రాత్రి చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంది. రాత్రిపూట చిరుజల్లులు కురండంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

రెండు మండలాల్లో భారీవర్షం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో గురువారం రాత్రినుంచి ఉరుములు, మెరుపులో కూడినభారీవర్షం కురుస్తోంది.

జగిత్యాల మార్కెట్ యార్డుకు నేటినుంచి సెలవులు


జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్‌కు ఈనెల 17 – 20వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కల రాధ తెలిపారు. ఈమేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షంతో పంట ఉత్పత్తులు తడిసే ప్రమాదం ఉందని వివరించారు. దీంతో వ్యాపారుల కోరిక మేరకు కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఆమె వివరించారు. రైతులు ఎవరుకూడా తమ ఉత్పత్తులను తీసుకురావద్దని ఆమె కోరారు.

దోచిందెంత? దాచిందెంత?

ఐదు, పదికాదు.. ఏకంగా రూ.72 లక్షలు.. కోరుట్ల మున్సిపాల్టీలో ఆరు నెలల క్రితం మహిళా సంఘాల రుణాల పేరిట దుర్వినియోగమైన సొమ్ము ఇది. సరిగ్గా లెక్కలు తీస్తే రూ.కోటి వరకు కొల్లగొట్టినట్లు అంచనాలు ఉన్నాయి. ఇంతపెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం చేయడంలో ఓ ఆర్పీ, మెప్మా టీఎంసీలు బాధ్యులని తేలింది. అయినా, సొమ్ము రికవరీపై ఇంకా దృష్టి సారించడంలేదు. ఈ వ్యవహారంలో ఆర్పీతోపాటు ఓ దళారీని పోలీసులు ఇటీవల అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

- లెక్కతేలింది రూ.72లక్షలు
- లెక్కల్లోకి రానిది రూ.కోటికి పైనే..
- మహిళా సంఘాల రుణాల్లో గోల్‌మాల్
- దుర్వినియోగం చేసింది టీఎంసీ, ఆర్పీ
- రికవరీలో అధికారుల మీనమేషాలు

కోరుట్ల: మున్సిపాల్టీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా).. టౌన్ మిషన్ కో ఆర్డినేటర్(టీఎంసీ), ఓ రిసోర్స్ పర్సన్(ఆర్పీ) కలిసి నిధుల స్వాహాపర్వానికి తెరలేపారు. సుమారు ఏడాదిగా ఈ తంతు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ ఆర్పీ మహిళా సంఘానికి చెందిన రూ.10లక్షలు డ్రా చేసుకుని అకస్మాత్తుగా ఉడాయించడంతో నిధుల దుర్వినియోగం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా విచారణ జరిపిన పోలీసులు.. పాత మహిళా సంఘాల్లో కొత్త సభ్యుల పేర్లు నమోదు చేశారు.. పాత సంఘం పేరిట ఉన్న బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. వాటిని వాయిదాల పద్ధతిలో చెల్లించినట్లు స్టేట్‌మెంట్లు జతచేశారు. అయితే, నిందితులు కొత్తగా మళ్లీ ఒక్కో సంఘం పేరిట రూ.10 లక్షల రుణాలు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఆర్పీతోపాటు టీఎంసీలు కలిసి అర్హత లేని మహిళా సంఘాలకు రూ.10లక్షల రుణం ఇప్పించినందుకు అందులో సగం.. అంటే రూ.5 లక్షలు సొంతానికి వినియోగించుకుని.. మిగిలిన సొమ్ము మహిళలకు చెల్లించినట్లు విచారణలో తేల్చారు. ఈ లెక్కన మెట్‌పల్లిలోని ఓ బ్యాంకులో 10 బినామీ మహిళా సంఘాల పేరిట రూ.కోటి వరకు రుణాలు తీసుకున్నారు. ఇందులోంచి కొంత మహిళా సంఘాలకు ఇవ్వగా మిగిలిన రూ.72 లక్షలు దుర్వినియోగమైనట్లు లెక్క తేల్చారు. ఆ తర్వాత పోలీసులు ఆర్పీని, ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న మరోవ్యక్తిని అరెస్టు చేశారు.



బ్యాంకర్లదే బాధ్యత

రుణాల మంజూరులో బ్యాంకు అధికారులు నిబంధనలు పట్టించుకోలేదు. మున్సిపల్ నుంచి పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే రుణాలు మంజూరు చేశారు. ఫలితంగానే రుణాల దుర్వినియోగానికి అవకాశం చిక్కింది. ఈ విషయంలో బ్యాంకు అధికారులే అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

– ఆయాజ్, కమిషనర్, మున్సిపాలిటీ

రికవరీ మాట మరిచారు..!

- మహిళా సంఘాల నిధులు దుర్వినియోగం చేసిన కేసులో ఇద్దరి అరెస్టు తర్వాత వ్యవహారం మూలనపడింది.
- దుర్వినియోగమైన సొమ్ము రికవరీ విషయంలో అధికారులు ఇప్పటికీ చొరవ చూపిన దాఖలాలు లేవు.
- ఫలితంగా దుర్వినియోగమైన సొమ్ము చెల్లించాలంటూ ఆర్పీ, టీఎంసీ సృష్టించిన బినామీ సంఘాల్లోని మహిళా సభ్యులకు బ్యాంకు అధికారులు నోటీసులు జారీచేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- వాస్తవానికి మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న డబ్బులు కేవలం పాతిక శాతమే కాగా.. ఆర్పీ, టీఎంసీలు స్వాహా చేసిన సొమ్ము కూడా చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.
- ఈ పరిస్థితుల్లో రుణాల పేరిట డబ్బులు దుర్వినియోగం చేసిన వారినుంచి రికవరీ చేస్తే నిధుల స్వాహాలో కేవలం పావులుగా మారిన మహిళా సంఘాల సభ్యులకు ఊరట దక్కుతుంది.

క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

• ట్రాఫిక్ ఎస్సై రాము



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామని ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 76 మందిని కోర్టులో హాజరుపర్చగా గురువారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జితేందర్ రూ.78 వేల జరిమానా విధించారు. అనంతరం ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

ఢిల్లీకి తరలివెళ్లిన ఎమ్మెల్యే, నాయకులు



ఢిల్లీలో ఎమ్మెల్యే, నియోజకవర్గ నాయకులు

జగిత్యాల:/జగిత్యాల రూరల్: ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణలో భాగంగా ఢిల్లీకి వెళ్లగా మద్దతు కోసం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. ఢిల్లీలో ఎమ్మెల్సీ కవితకు మద్దతుగా నిలిచారు.

'బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి'

ధర్మపురి : వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలపై బీఆర్‌ఎస్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపెల్లి రాజమ్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఢిల్లీలో మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టగా బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారన్నారు. ఇక్కడ షర్మిలతో పాటు రాష్ట్ర నాయకులు సత్యవతి, గడిపెల్లి కవిత, చైతన్యరెడ్డి తదితరులున్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..?

• క్రమబద్ధీకరణకు నోచుకునేదెప్పుడో...?
• ఉద్యోగ భద్రతకు ఏళ్లుగా పోరాటం
• ప్రభుత్వ నిర్ణయం కోసం అంగన్‌వాడీల ఎదురుచూపులు

కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రొఫైల్ :

ప్రాజెక్టులు	: 16
అంగన్‌వాడీ కేంద్రాలు	: 3,500
అంగన్‌వాడీ టీచర్లు	: 3,300
అంగన్‌వాడీ ఆయాలు	: 3,000



వాల్గొండలో తల్లిపాల వారోత్సవాల గురించి వివరిస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

మల్లాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కొన్నేళ్లుగా తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా విధులు నిర్వర్తిస్తున్న ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాల నుంచి అంగన్‌వాడీలకు కనీస గుర్తింపు కూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ హామీతో తమకు ఉద్యోగ భద్రతతో క్రమబద్ధీకరణకు నోచుకుంటాయని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఐసీడీఎస్ ప్రారంభం నుంచి సేవలు..

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 1975లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కేంద్రాల్లో విధులు నిర్వర్తించేందుకు అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలను నియమించింది. గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, పిల్లల పేర్లు నమోదు చేసుకోవడం, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు చర్యలు, పౌష్టిహారం అందించడం , బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలకు పంపడం , గర్భిణీ, పరిసరాల శుభ్రతలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించే వంటి విలువైన సేవలను అంగన్‌వాడీ టీచర్లు అందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,500 అంగన్‌వాడీ కేంద్రాలు..

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 16 ప్రాజెక్టుల్లో 3,500 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా, 3,300 మంది అంగన్‌వాడీ టీచర్లు, 3,000 మంది ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా జగిత్యాల జిల్లాలో 4 ప్రాజెక్ట్‌ల్లో 1065 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1010మంది అంగన్‌వాడీ టీచర్లు, 950మంది ఆయాలు పనిచేస్తున్నారు. మల్లాపూర్ మండలంలోని 54 అంగన్‌వాడీ కేంద్రాల్లో 53మంది అంగన్‌వాడీ టీచర్లు, 41మంది ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,500, ఆయాకు రూ.7,800ల చొప్పున కనీస గౌరవవేతనం అందిస్తున్నారు.

విధులతో పాటు అదనపు సేవలు...

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అంగన్‌వాడీ టీచర్లను ఐసీడీఎస్‌తో పాటు అనేక అదనపు పనులకు వినియోగించుకుంటుంది. బీపీఎల్ సర్వేలు, బీఎల్వో విధులు, ఓటరు గుర్తింపు, రేషన్‌కార్డుల పంపిణీ, అమృత హస్తం, ఎన్నికల పోల్‌చిటీలు పంపిణీ వంటి అదనపు పనులకు అంగన్‌వాడీలనే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా సేవలు అందిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని గత ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అందరిని క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినందున ప్రభుత్వ నిర్ణయం కోసం అంగన్‌వాడీలు ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు...

రాష్ట్ర వ్యాప్తంగా 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులు(సీడీపీవో), అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల క్రమబద్ధీకరణకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని మండలాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాల ఆధారంగా సిబ్బందిని క్రమబద్ధీకరించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రీప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

గుర్తింపు లేదు



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కేంద్రాల నిర్వహణతో పాటు అదనపు సేవలందిస్తున్న అంగన్‌వాడీలను గుర్తించడం లేదు. గౌరవ వేతనం పేరిట గత ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి పాల్పడ్డాయి.
–వకుల, అంగన్‌వాడీ టీచర్‌వాల్గొండ

కనీస వేతనం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న టీచర్లు, ఆయాలకు ఉద్యోగ భద్రతను కల్పించి కనీస వేతనం అందించాలి. అంగన్‌వాడీ టీచర్లకు రూ.25వేలు, ఆయాలకు రూ.15వేల వేతనాన్ని అమలు చేయాలి.
–ఇందిరా, అంగన్‌వాడీటీచర్, మల్లాపూర్

సంక్షేమ పథకాలు అందించాలి



మహిళ, శిశు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి. అదనపు విధులతో అంగన్‌వాడీ టీచర్లపై పనిభారం పెరుగుతోంది.
–రజిత, అంగన్‌వాడీ టీచర్ సంగం, శ్రీరాంపూర్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి...



ఐసీడీఎస్ విధులతో పాటు అదనపు సేవలకు వినియోగించుకుంటున్న అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. అంగన్‌వాడీ టీచర్లను 3వ తరగతి ఉద్యోగులుగా, ఆయాలను నాలుగో తరగతి ఉద్యోగులుగా క్రమబద్ధీకరించి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలి.
–సంధ్య, అధ్యక్షురాలు, అంగన్‌వాడీ యూనియన్, వీవీరావుపేట

అసంపూర్తిగా వేలం



వేలంలో పాల్గొన్న టెండర్ దారులు

కొండగట్టు (చొప్పదండి) : కొండగట్టు ఆంజనేయ స్వామివారి ఆలయంలోకొండపై పలు దుకాణాలకు సంబంధించిన వేలం గురువారం నిర్వహించారు కొబ్బరికాయలు, కొబ్బరిముక్కలు, హోటల్, కిరాణం, బొమ్మలు, పాదరక్షలు వంటచెరకు టెంట్‌హౌజ్ పూలుపండ్లు లాకర్ మరుగుదొడ్లు ఫొటో స్టూడియో శీతలపానీయాలకు టెండర్లు ఏడాదికి వేలం నిర్వహించగా ఇందులో కొబ్బరికాయలు టెండర్ వేములవాడకు చెందిన పులి మల్లేశంకు దక్కింది. మరుగుదొడ్లు, టెంట్‌హౌజ్ లాకర్‌రూం ఫొటోస్టూడియో, వంటచెరుకు, పూలుపండ్ల వేలం వాయిదపడ్డాయి. వీటిని త్వరలోనే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. టెండర్ల పర్యవేక్షకులు రవికిషన్ ఈవో టి.వెంకటేశ్ చైర్మన్ మారుతిస్వామి సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి, టెండర్ దారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వన సందర్శన

కోరుట్ల: మండలంలోని మాదాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, మేడిపెల్లి మండలం దమ్మన్నపేట, ఆలూర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు గురువారం వన సందర్శనకు తరలివెళ్లారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో గల కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో నేచర్ క్యాంపు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, వణ్యప్రాణుల సంరక్షణ తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జన్నారం అటవీ శాఖ జన్నారం డివిజన్ ఎఫ్‌ఆర్వో హఫీజొద్దీన్, ఎఫ్‌ఎస్ఓ జ్యోతి కిరణ్మయి, బీట్ ఆఫీసర్ సతీశ్ ఆధ్వర్యంలో వన సందర్శన పూర్తి చేశామని నేచర్ క్యాంపు స్టేట్ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్, జి. మూర్తి, ఏ.పెద్ద రాజం, రాజగోపాల్, ప్రశాంతి, శారద పాల్గొన్నారు.

పిల్లల హక్కులు హరిస్తే ఉపేక్షించం

• బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెల దేవయ్య



మాట్లాడుతున్న దేవయ్య



పాల్గొన్న అధికారులు

జగిత్యాల:పిల్లల హక్కులు హరిస్తే ఉపేక్షించేది లేదని, వారిని పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెల దేవయ్య హెచ్చరించారు. గురువారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీవోసీలో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలతో వెట్టిచాకిరీ చేయించడంతో పాటు వారితో భిక్షాటన చేయిస్తున్నారని అన్నారు. గంజాయి, హుక్కా లాంటి వ్యసనాలకు చిన్నారులు బానిసలవుతున్నారని, వారిని సన్మార్గంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. 18ఏళ్లలోపు పిల్లలకు మద్యం విక్రయిస్తే వారి ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలపై అత్యాచారా అత్యధికంగా జరుగుతున్నాయని, నిందితులపై కచ్చితంగా పోక్సో కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని వలస కూలీల పిల్లల వివరాలు సేకరించి, వారికి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. పిల్లలతో పనిచేయిస్తున్న వ్యాపారులను గుర్తించి దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయాలని, షాపులు సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెచ్‌ఐవీతో బాధపడుతున్న పిల్లల ప్రత్యేక అవసరాలను గుర్తించి వాటిని తీర్చాలని సూచించారు. ప్రతీ స్కూల్, గ్రామపంచాయతీ కార్యాలయంలో 1098 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం బాలల హక్కుల ప్రచార వాల్‌పోస్టర్స్, కరదీపికలను కలెక్టర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లత, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, డీఎంహెచ్‌వో శ్రీధర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సాయిబాబా, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, డీసీపీవో హరీశ్, పీవోఐసీ కరుణశ్రీ, బాలల పరిరక్షణాధికారులు పాల్గొన్నారు.

'నిధుల కేటాయింపుపై సమాధానమివ్వాలి'

సారంగాపూర్ : గ్రామ పంచాయతీలో నిధుల వినియోగంపై సమాచార హక్కు చట్టం 2005 ద్వారా వివరాలు ఇవ్వాలని బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన సతీశ్ పంచాయతీ కార్యదర్శిని కోరాడు. వివరాలు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శి దాటవేసే యత్నం చేస్తుండగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని సతీశ్ తెలిపాడు. ఫిబ్రవరి 1, 2019 నుంచి మంజూరైన నిధులు, చేసిన పనులు, వివరాలు తెలపాలని బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను కోరాడు. ఇందుకు గ్రామ పంచాయతీలో రుసుము చెల్లించి సమాచారం తీసుకెళ్లాలని లిఖితపూర్వకంగా కార్యదర్శి నారాయణ సమాధానం ఇచ్చాడు. సతీశ్ సమాచారం కోసం గ్రామ పంచాయతీకి వెళ్లగా లేదని చెప్పడంతో గురువారం కార్యదర్శి, సతీశ్ మధ్య గొడవ జరిగింది. ఈ విషయంపై మండలపరిషత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లే స్పందించడం లేదని తెలిపాడు. కార్యదర్శి నారాయణను వివరణ కోరగా.. రికార్డులను మూడునెలల క్రితం డీఎల్‌పీవో సీజ్ చేశారని, నాలుగైదు రోజుల్లో సమాచారం ఇస్తానని తెలిపాడు.



సతీశ్ అందించిన దరఖాస్తు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

జగిత్యాల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జీసీ) స్టేట్ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. గురువారం అటవీ పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మాదాపూర్, దమ్మన్నపేట, ఇబ్రహీంనగర్, గోదూరు, ఆలూరు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఈ పర్యటనతో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, వివిధ పక్షిజాతులు, జంతుజాతుల గురించి అవగాహన పెంచుకోవడంతో పాటు నైపుణ్యం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులను డీఈవో జగన్ మోహన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అటవీశాఖ జన్నారం డివిజన్ ఎఫ్ఆర్వో హఫీజోద్దీన్, ఎఫ్ఎస్‌వో జ్యోతి కిరణ్మయి, బీట్ ఆఫీసర్ సతీశ్, జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్, మూర్తి, పెద్దరాజం, రాజ్‌గోపాల్, శారద పాల్గొన్నారు.

షెడ్లు ప్రారంభించాలి



మాట్లాడుతున్న బోగ శ్రావణి

జగిత్యాల:వీధివ్యాపారుల షెడ్లను వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రహదారుల విస్తరణ, వ్యాపారుల క్రమబద్ధీకరణలో భాగంగా పట్టణ ప్రగతి నిధులను వెచ్చించి పాతబస్టాండ్ నుంచి గొల్లపల్లి రోడ్డులోని వీధివ్యాపారుల కోసం కేటాయించిన 37 షెడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అయినా, నేటికీ వాటిని ప్రారంభించడం లేదన్నారు. కొన్నిరాజకీయ కారణాలతో వాటిని ప్రారంభించడం లేదని, ఇప్పటికైనా వీధివ్యాపారులను ఆదుకోవాలన్నారు. అలాగే పట్టణ ప్రగతి, మెప్మా నిధుల ద్వారా నిర్మించాల్సిన 23 షెడ్ల పనులను కూడా ప్రారంభించాలని అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు వీధివ్యాపారులకు చేయూతనివ్వాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శ్రావణ్ (ఫైల్)

మానకొండూర్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాపాక శ్రావణ్(24) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. శ్రావణ్ కరీంనగర్‌లో ఓ లేత్ మిషన్‌లో ఆరేళ్లుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. బుధవారం అన్నారంలో జరిగిన బరాత్ కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రివేళ తిరిగి ఇంటికి వస్తుండగా అన్నారం పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రావణ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాత్రి ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. గురువారం ఉదయం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లి రాజేశ్వరి, తండ్రి ఓదెలు, ఇద్దరు అక్కలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజకుమార్ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని పలుగ్రామాల శివార్లలో గురువారం పోలీసులు ఇసుక డంపులను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని జిల్లెల్ల, మల్లాపూర్, ఇందిరమ్మ కాలనీ శివారులో ఆరు ట్రిప్పుల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

జగిత్యాలజోన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ ఒకరికి రూ.15,965 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య గురువారం తీర్పు చెప్పారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం... మల్లాపూర్ మండలం .. వేంపల్లి వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన పల్లెపు వెంకటస్వామి జూన్ 27, 2016న విద్యుత్ చౌర్యానికి పాల్పడగా అధికారులు పట్టుకుని మొదటి తప్పుగా భావించి రూ.వెయ్యి జరిమానా విధించారు. మళ్లీ మార్చి 9, 2017న మరోసారి పట్టుబడడంతో విద్యుత్ అధికారులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంకటస్వామిపై కేసునమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం వెంకటస్వామికి రూ.15,966 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేకపోతే ఆరునెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

రుద్ర శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు

మల్లాపూర్ : మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద గురువారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రుద్ర శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రుద్ర రాంప్రసాద్, సీనియర్ నాయకులు మూర్త శివకుమార్, మచ్చ వెంకటరమణ, అడ్డగట్ల సురేశ్, మోర సతీశ్, బోగ శ్రీనివాస్, సాదుల ప్రకాశ్, మూర్త సతీశ్‌కుమార్, మ్యాకల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

• రైతు సంఘం జిల్లా నాయకుడు తిరుపతినాయక్



మాట్లాడుతున్న తిరుపతినాయక్

జగిత్యాలటౌన్: విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, ఉపాధిహామీ పనిదినాల పెంపు, కార్మిక ధరల పెరుగుదల నియంత్రణ తదితర డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో లక్షలాది మందితో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు తిరుపతినాయక్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఏడాదికిపైగా జరిపిన సమరశీల పోరాటంతో దిగివచ్చిన మోదీ ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిందని, కానీ అదే చట్టాలను దొడ్డి దారిన అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ, సీఐటీయూ కోకన్వీనర్ ముదుగం రాజలింగం, జిల్లా నాయకులు కోమటి చంద్రశేఖర్, సభ చంద్రయ్య, శ్రీపెల్లి పద్మ, గాజర్ల రాజవ్వ, భాగ్య, ఉమ్మడి రమేశ్, గంగయ్య పాల్గొన్నారు.

కవితను కాపాడేందుకే ఢిల్లీకి పయనం

• బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి



ధర్మపురిలో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి

ధర్మపురి : లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను కాపాడేందుకే మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీకి పయనమవుతున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం ఆరోపించారు. నియోజకవర్గంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మంత్రులు, ఎమ్మెల్యేలంతా పాలనా గాలికొదిలేసి కవితను కాపాడం కోసం ఢిల్లీకి వెళ్తున్నారన్నారు. నిరుద్యోగులను నిందా ముంచుతూ వారి జీవితాలతో చెలగాటమాడతున్నారని మండిపడ్డారు. మంత్రి కేటీఆర్ అహంకారపూరితమైన మాటలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇక్కడ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు ఆకుల శ్రీనివాస్, గాజు భాస్కర్, సంగి మాధవ్, స్తంభంకాడి శ్యామ్, తదితరులున్నారు.